చల్‌గల్‌లో ఎల్లమ్మ బోనం ఎత్తుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

కులవృత్తుల అభ్యున్నతికి కేసీఆర్ కృషి

■ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ■ చల్‌గల్‌లో ఎల్లమ్మ బోనాలకు హాజరు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 6: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కుల సంఘాలు, కులవృత్తుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మ పట్నాలు, బోనాలు కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చల్‌గల్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేసీఆర్ ప్రభుత్వం రూ. 51కోట్లు ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగనర్సు, రాజన్న, మాజీ ఉప సర్పంచ్ పద్మాతిరుపతి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు పూదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిరికొండ విండో చైర్మన్‌గా జీవన్‌రెడ్డి

కథలాపూర్, ఫిబ్రవరి 6: సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా గ్రామానికి చెందిన కందరి జీవన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం చైర్మన్ ఎన్నికను అధికారులు నిర్వహించగా..ముగ్గురు డైరెక్టర్లు కందరి జీవన్‌రెడ్డి, చుక్క దేవరాజం, కందరి కిషన్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం జిల్లా సహకార అధికారి సత్యనారాయణ చేతులెత్తే విధానంలో ఎన్నిక నిర్వహించారు. ఎన్నికకు 13 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. ఇందులో కందరి జీవన్‌రెడ్డికి 9 మంది డైరెక్టర్లు, చుక్క దేవరాజంకు నలుగురు డైరెక్టర్లు మద్దతుగా చేతులెత్తారు. కందరి కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎవరూ చేతులెత్తలేరు. దీంతో కందరి జీవన్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. కోరుట్ల సీఐ ప్రవీన్‌కుమార్, కథలాపూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

దివ్యాంగులకు రాయితీ ఐడెంటిటీ కార్డుల పంపిణీ

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 6 : యూసుఫ్ నగర్‌లో దివ్యాంగులకు 50 శాతం రాయితీపై గుర్తింపు కార్డులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ సురేశ్‌గౌడ్ మంగళవారం పంపిణీ చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సహకారంతో 30 మంది దివ్యాంగులకు కార్డులను అందించారు. 10వేల మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే సొంత ఖర్చులతో 50 శాతం రాయితీ అందజేయడం అభినందనీయమని ఆయన తెలిపారు.

ట్రస్మా బాధ్యుడికి సన్మానం

కోరుట్ల, ఫిబ్రవరి 6: పట్టణంలోని లిటిల్ జీనియస్ హైస్కూల్ కరస్పాండెంట్ బండి మహదేవ్ జిల్లా ట్రస్మా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆయనను మేనేజ్‌మెంట్ సన్మానించింది.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-AII

CHANGE OF NAME

★ I, CHITTIMALLA RAMADEVI, W/o. Mukka Rajalaxmaiah, R/o. 2-11-1, Market Road, Jammikunta, Karimnagar, TS. Changed My Name as MUKKA RAMADEVI, W/o. Mukka Rajalaxmaiah.
NT-311079

★ I, CHITTIMALLA SRIMANNARAYANA, S/o. Venkataiah, R/o. 8-1-105, Gandhichowk, Jammikunta, Karimnagar, TS. Changed My Name as CHITTIMALLA SREEMANNARAYANA, S/o. Venkataiah.
NT-311079

CHANGE OF NAME

★ I Narla Harika, W/o. Narla Shankar @ Before Marriage Moota Mounika D/o Moota Bhumaiah, R/o. H.No. 3-191, Jabithapur (Vill), Jagithyal Dist. after marriage changed my name as NARLA HARIKA W/O. NARLA SHANKAR.
NTK-316887

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

అంబేద్కర్ ఉత్సవ విగ్రహ కమిటీ

పెగడపల్లి, ఫిబ్రవరి 6: మద్దులపల్లి గ్రామంలో మంగళవారం అంబేద్కర్ ఉత్సవ విగ్రహ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆరెల్లి స్వామి, గౌరవాధ్యక్షుడిగా అరికట్ల సంజీవ్, ఉపాధ్యక్షులుగా ఆరెల్లి రాకేశ్, బొల్లం సుందర్, కార్యదర్శులుగా ఆరెల్లి నారాయణ, సుధాకర్, అజయ్, బొల్లం పురుషోత్తం, అరికట్ల మాణిక్యం ఎన్నికయ్యారు. అలాగే సహాయ కార్యదర్శిగా ఆరెల్లి సాయిలు, అంజయ్య, భూపెల్లి సంజీవ్, సంయుక్త కార్యదర్శులుగా శంకరయ్య, రమేశ్, మాణిక్యం, సురేశ్, కోశాధికారిగా మండిగం అనిల్, సలహాదారులుగా రమేశ్, రాజేశం, శంకర్, కార్యవర్గ సభ్యులుగా ప్రభాకర్, కొమురయ్య, రత్నం, సంజీవ లచ్చయ్య, ఏసురత్నం ఎన్నికయ్యారు.

సామూహిక కుంకుమార్చనలు

మారుతీనగర్, ఫిబ్రవరి 6 : మెట్‌పల్లి పట్టణ శివారులోని పెద్దమ్మ ఆలయంలో అర్చకులు మదన్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు

కథలాపూర్, ఫిబ్రవరి 6 : బొమ్మెన, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో కోరుట్ల పశు వైద్య కళాశాల, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 145 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు చేశారు. 276 పశువులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేవతి, పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ మాధవరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు అంబిక, పరశురాములు, సురేశ్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, మండల పశు వైద్యాధికారులు శ్రీనివాస్, దివ్యశ్రీ, కళాశాల డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదుపై డీఎస్పీకి వినతి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 6: సాంఘిక బహిష్కరణ చేశారంటూ స్థానిక గౌడ కులస్తులు తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని, గ్రామానికి వచ్చి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఆత్మకూర్ గ్రామస్తులు, వీడీసీ సభ్యులు మంగళవారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. 20 ఏళ్ల క్రితం ఆత్మకూర్ గ్రామానికి చెందిన ఎడ్మల నర్సారెడ్డి 23 ఎకరాల తన సొంత భూమిని గ్రామానికి తక్కువ ధరకు విక్రయించేందుకు అంగీకరించారన్నారు. గ్రామంలో సరిపోయేంత కల్లు దొరకడం లేదని సంబంధిత భూమిని అప్పటి సర్పంచ్ ఆధ్వర్యంలో గౌడ కులస్తుల ద్వారా సొసైటీ పేరుమీద కొనుగోలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈ భూమిని కులవృత్తి కోసం మాత్రమే ఉపయోగించుకోవాలని ఒప్పందం జరిగిందన్నారు. ప్రస్తుతం అందులో నుంచి ఆరెకరాలు వాణిజ్య అవసరాలకు అమ్ముకునేందుకు గౌడ కులస్తులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గౌడ సంఘ సభ్యులను పిలిచి సంజాయిషీ అడుగగా, వారం రోజుల తర్వాత తమ నిర్ణయం చెబుతామన్నారన్నారు. ఇలా ఉండగా గ్రామాభివృద్ధి కమిటీపై సోమవారం గౌడ కులస్తులు మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టారని తెలిపారు. ఆత్మకూర్ గ్రామానికి వచ్చి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

■ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
■ కోమటికొండాపూర్‌లో గుడ్‌మార్నింగ్ కార్యక్రమం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. మంగళవారం గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో భాగంగా కోమటి కొండాపూర్‌లో పర్యటించారు. వాడవాడనా తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. పలు కుల సంఘ భవనాలకు సీడీపీ ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పలువురు గ్రామస్తులు తమకు ఆరోగ్యం బాగాలేదంటూ డాక్టర్ సంజయ్ దగ్గరకు రాగానే వారికి వైద్య సేవలు అందించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ కష్టపడి చదవాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, ఎంపీడీవో ప్రభు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ జలేశ్, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్, ఫిబ్రవరి 6: మండల కేంద్రానికి చెందిన రుద్ర బుచ్చిరాజం ఇటీవల మృతి చెందాడు. మంగళవారం కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, ఫిబ్రవరి 6: విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ ఫ్యాకల్టీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సును ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఉచితంగా ఇంగ్లిష్ భాషను నేర్పించేందుకు ముందుకు వచ్చిన రాజశేఖర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సు పుస్తకాలను ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. అంతకుముందు పట్టణంలోని ఆల్ సీనియర్ సిటిజన్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలి వాసవి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అనిల్, నాయకులు లక్ష్మీనారాయణ, ప్రభాకర్, భూంరెడ్డి, మోహన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

బీసీ వసతి గృహం సందర్శన

పట్టణంలోని ఎస్కోనిగుట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వ మహిళా బీసీ వసతి గృహాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడారు. విద్యార్థినులకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ మండల వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

ధర్మపురి, ఫిబ్రవరి 6: పట్టణంలోని లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో బుధవారం ధర్మపురి నియోజవర్గ స్థాయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి రాష్ట్ర పరిశీలకుడు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఆలయ ఆవరణలో భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. దొంగల మర్రి నుంచి కొండగట్టు ఆలయం వరకు మూడు కిలోమీటర్ల మేర భక్తుల వాహనాలతో ట్రాఫిక్ జాం కాగా, స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. స్వామివారిని సుమారు 25 వేల మంది వరకు దర్శించుకున్నారని, రూ.10 లక్షల ఆదాయం సమకూరనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

మూడు నెలల్లో గృహప్రవేశం చేయిస్తా

■ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
■ డబుల్ బెడ్రూం ఇండ్ల సందర్శన

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 6: మూడు నెలల్లో లబ్ధిదారులను గృహప్రవేశం చేయిస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో అధికారులతో కలిసి డబుల్ బెడ్రూం ఇండ్లను సందర్శించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2009లో ఇల్లులేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు 111 ఎకరాల భూమి సేకరించి ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద 2009లో నాలుగు వేల ఇళ్లకు పునాది వేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిల్, హౌసింగ్ డీఈ రాజేశ్వర్, మిషన్ భగీరథ ఈఈ శేఖర్‌రెడ్డి, ఎలక్ట్రిసిటీ డీఈ గంగారాం, పీఆర్ డీఈ రెహమాన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం టీఆర్‌నగర్‌లో పర్యటించి కాలనీలో డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

మహిళల సంరక్షణకే భరోసా కేంద్రాలు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : బాధిత మహిళలకు రక్షణ, సంరక్షణ కల్పించేందుకే జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ వుమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో జగిత్యాలతో పాటు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 8 భరోసా కేంద్రాలను డీజీపీ రవిగుప్తా హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జగిత్యాల భరోసా కేంద్రంలోని పలు విభాగాలను ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు భరోసా కేంద్రంలో కౌన్సెలింగ్ ఇచ్చి అండగా నిలుస్తామని చెప్పారు. సీడబ్ల్యూసీ ద్వారా బాధిత మహిళలకు ఆశ్రయం కల్పిస్తామన్నారు. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన నాటి నుంచి పరిష్కారమయ్యే వరకు భరోసా కేంద్రం బాధిత మహిళలు, చిన్నారులకు అండగా నిలుస్తుందని చెప్పారు. బాధిత మహిళలు, చిన్నారులకు అందాల్సిన వైద్యం, న్యాయ సలహ, కౌన్సెలింగ్ కల్పించేందుకు పోలీసు, వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖల ఆధ్వర్యంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. బాధిత మహిళలు, చిన్నారులకు భరోసా కల్పించడమే కాకుండా వారిపై జరిగే నేరాలు, హింసను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. మహిళలు, యవతులు, బాలికలు అన్యాయాలకు గురైనప్పుడు వెనుకంజ వేయకుండా నిర్భయంగా భరోసా కేంద్రాలను ఆశ్రయించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీ వెంకటస్వామి, ఎస్‌బీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, ఆర్ఐ జానిమియా, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 6 : జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం ముద్రించిన ప్రచార కరపత్రాన్ని ప్రిన్సిపాల్ సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవం, ఉన్నత విద్యా ప్రమాణాలు కలిగిన అధ్యాపకులు ప్రభుత్వ కళాశాలలో ఉన్నారని, విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ

పరీక్షా ప్యాడ్ల పంపిణీ

కోరుట్ల, ఫిబ్రవరి 6: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపు లక్ష్యంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కళాశాల ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లను మంగళవారం అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో వసతి సౌకర్యాలు, ఉచిత విద్యా విధానంపై ప్రిన్సిపాల్ రాజేశ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గంగాప్రసాద్, అధ్యాపకులు నటరాజన్, శ్రీనివాస్, హబీబ్, వంశీ, శిరీశ్, సంజీవ్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల శోభాయాత్ర

శోభాయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొన్న మహిళలు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయం నుంచి సీతారాముల విగ్రహాలను శృంగేరి శారదా పీఠం ఆస్థాన పౌరాణికులు భారతీ తీర్థ పురస్కార గ్రహీత డాక్టర్ బాచంపెల్లి సంతోష్‌కుమార్ సారథ్యంలో ఊరేగించారు. అయోధ్య బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని వాసవి గార్డెన్స్‌లో జగదాలయ ఆధ్యాత్మిక బృందం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అఖండ హనుమాన్ చాలీసా అహోరాత్ర పారాయణ మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఈ నెల 7న అఖండ హనుమాన్ చాలీసా పారాయణం, 8న శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న నిర్వాహకులు పేర్కొన్నారు. శోభాయాత్రలో నిర్వాహకులు శ్రవణ్‌కుమార్, చంద్రశేఖర్, కైలాసం, రామనారాయణ, సామాజిక కార్యకర్త రామచంద్రం, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి: ఎమ్మెల్యే

మల్యాల, ఫిబ్రవరి 6 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మంగళవారం తాటిపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎంపీటీసీ అనిత-ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

మారుతీనగర్, ఫిబ్రవరి 6 : మెట్‌పల్లి డివిజన్ స్థాయి పదోతరగతి టాలెంట్ టెస్టులో 600 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ చూపిన వారిని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విభాగంలో ప్రథమ స్థానంలో మెట్లచిట్టాపూర్ పూలే బాలికల పాఠశాలకు చెందిన అంజన, ద్వితీయ స్థానంలో జడ్పీహెచ్ఎస్ మొగిలిపేటకు చెందిన రహీమా, ప్రైవేట్ పాఠశాల విభాగంలో ప్రథమ నమ్రత, ద్వితీయ స్థానంలో రిత్విక నిలిచారు. పలువురు విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులకు ఎంపికయ్యారు. విద్యార్థులకు ఈ నెల 9న కళాశాల వార్షికోత్సవంలో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 6: మండలంలోని కొండగట్టు దిగువ ప్రాంతానికి చెందిన బండల్ల అజయ్ (19) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. అజయ్ తల్లిదండ్రులు కొండగట్టు దిగువన బొమ్మల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. కాగా, మంగళవారం కుటుంబ సభ్యులందరూ దుకాణంలో ఉండగా, అజయ్ సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి తరచూ ఫిట్స్ వచ్చేదని, ఈ క్రమంలో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

కొడిమ్యాల, ఫిబ్రవరి 6: తిప్పాయిపల్లి, నర్సింహులపల్లిలో నిర్మించబోయే పూడూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలకు నిధులు మంజూరు చేయాలని సహకార సంఘం డైరెక్టర్లు నర్సింహారెడ్డి, మల్లేశం మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతి పత్రం సమర్పించారు. గోదాంలు నిర్మించడంతో తిప్పాయిపల్లి పరిధిలోని నల్లగొండ, చెప్యాల గ్రామాలకు, నర్సింహులపల్లి పరిధిలో గౌరాపూర్ గ్రామాల రైతులకు ఎరువులు, మందులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

నాబార్డ్ ధ్రువీకరణ పత్రాల పంపిణీ

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 6: పొరండ్ల, కల్లెడ క్లస్టర్ల పరిధిలో నాబార్డ్, స్పందన సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళా సంఘాల సభ్యులకు మంగళవారం తక్కళ్లపల్లిలోని కల్యాణ మండపంలో ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ తరగతులు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. నాబార్డ్ జిల్లా అధికారి మనోహర్ రెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్, వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరేశ్, ఏపీడీ సుధీర్, స్పందన సంస్థ నిర్వాహకురాలు శోభారాణి, టీలైప్ జిల్లా ఆర్గనైజర్ శిరీషారెడ్డి, ఎంపీవో రవిబాబు, కేడీసీసీ మేనేజర్, ఏపీఎం, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

మల్యాల/మల్లాపూర్, మేడిపల్లి, ఫిబ్రవరి 6 : మల్యాల మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తా, మల్లాపూర్ మండల కేంద్రంలోని భరత మాత కూడలి, భీమారం, మేడిపల్లి మండల కేంద్రాల్లో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మేడిపల్లిలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రాక్టికల్స్

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 6 : ఇంటర్ రెండో విడుత ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు కన్వీనర్ నారాయణ తెలిపారు. ఉదయం జరిగిన జనరల్ విభాగంలో 397 మంది విద్యార్థులకు గానూ 388 మంది హాజరు కాగా 9 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 172 మంది విద్యార్థులకు గానూ 156 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో జనరల్ విభాగంలో 122 మంది విద్యార్థులకు గానూ 122 మంది హాజరు కాగా, వొకేషనల్‌లో 103 మంది విద్యార్థులకు గానూ 96 మంది హాజరై, ఏడుగురు గైర్హాజరైనట్లు వెల్లడించారు. రూ. 4500 పెనాల్టీతో వార్షిక పరీక్ష ఫీ చెల్లింపునకు ఈ నెల 7 వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు.

సామాజిక అంశాలపై అవగాహన

మల్యాల, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలో పలు సామాజిక అంశాలపై పోలీస్ కళాబృంద సభ్యులు పాటలు, నాటకాల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలు వీడాలని చెప్పారు. ఎస్ఐ కుమారస్వామి, పోలీస్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో శిక్షణ

రాయికల్, ఫిబ్రవరి 6: పట్టణంలోని చిన్నజీయర్ స్వామి ట్రస్టు భవనంలో జీఎంఆర్ వరలక్ష్మి, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి సెల్ ఫోన్ రిపేరింగ్ కోర్సులో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఫౌండేషన్ ఆర్గనైజర్ రఘుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయికల్ పరిసర మండలాల్లోని 18 నుంచి 30 సంవత్సరాల లోపు, 10వ తరగతి పూర్తి చేసిన యువత దరఖాస్తులను ఈ నెల 10 లోపు సమర్పించవచ్చన్నారు. వివరాలకు 9963347142 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెద్దపెల్లి ఎంపీ టికెట్ ఇవ్వాలి ధర్మపురిలో బీజేపీ నాయకుడి దీక్ష

ధర్మపురి, ఫిబ్రవరి 6 : పెద్దపెల్లి పార్లమెంట్ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం తనకే కల్పించాలని జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు రాయిల్ల రవి కుమార్ ధర్మపురిలో మంగళవారం విజ్ఞప్తి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీలో గత 15 ఏళ్లుగా క్రియాశీలకంగా పనిచేస్తున్నానని, మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని కాంక్షిస్తూ 2013లో ధర్మపురి నుంచి జమ్మూకశ్మీర్ వరకు సైకిల్ యాత్ర చేపట్టానని, 2019లో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సైకిల్ యాత్ర చేపట్టానని గుర్తుచేశారు. టికెట్ ఇప్పించడంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిక చొరవ చూపాలని కోరారు. రవి కుమార్ దీక్షను ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చందోళి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు మాలవేసి ప్రారంభించారు.

21 వరకు ఫీజు చెల్లించాలి

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 6: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ద్వారా ప్రవేశం పొంది ఏప్రిల్‌లో నిర్వహించే పది, ఇంటర్ పరీక్షలకు ఈ నెల 12 నుంచి 21 వరకు పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని టాస్ రాష్ట్ర సంచాలకుడు శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరు కాని వారు, ఫెల్ అయనవారు కూడా పరీక్షలు రాసేందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ఏఐ కోఆర్డినేటర్ అనుమల్ల శ్యామ్‌ను 9849266786 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు కొండగట్టు టెండర్లు

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టు అంజన్న ఆలయానికి అవసరమైన వస్తువులను సరఫరా చేసేందుకు గానూ సప్లయ్ టెండర్లు బుధవారం కరీంనగర్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో టంకశాల వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సప్లయ్ టెండర్లతో పాటు ఆలయ పరిధిలోని కల్యాణకట్టలో భక్తులు మొక్కులు చెల్లించే తలనీలాలను ఏడాది పాటు సేకరించుకునేందుకు కూడా టెండర్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నూతన నియామకం

కొడిమ్యాల, ఫిబ్రవరి 6 : పూడూర్‌కు చెందిన కవ్వం మధు ను జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నాయకులకు మధు కృతజ్ఞతలు తెలిపారు.

కమిషనర్‌కు వినతి

కోరుట్ల, ఫిబ్రవరి 6: పట్టణంలోని 29వ వార్డు రథాల పంపు కాలనీ వాసులు మంగళవారం కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ తవ్వకాల్లో రహదారి తీవ్రంగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇక్కడ బీసీ రాష్ట్ర కార్యదర్శి గోపి తదితరులున్నారు.

నల్లగొండలో టెండర్లు పూర్తి

కొడిమ్యాల, ఫిబ్రవరి 6 : నల్లగొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం టెండర్లు నిర్వహించినట్లు ఆలయ ఈవో అనూష తెలిపారు. పట్టెనామాలు కొరమీసాలు అమ్ముకొనే హక్కును రూ.లక్షా 51 వేలు, కొబ్బరి ముక్కల విక్రయ హక్కుకు రూ. 35 వేలు వేలం పాడి టెండర్లు దక్కించుకునట్లు తెలిపారు. దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవి కిషన్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సత్యనారాయణరావు ఉన్నారు.

స్పోర్ట్స్ క్లబ్ కార్యవర్గం

మల్లాపూర్, ఫిబ్రవరి 6: రేగుంట గ్రామ ఆల్ యూత్ అసోసియేషన్ స్పోర్ట్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దేవరాజం, కోశాధికారిగా రమేశ్, స్పోర్ట్స్ ఇన్‌చార్జీలుగా ముస్తఫా, అశోక్‌రెడ్డి ఎన్నికయ్యారు.

జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారిణి ప్రాతినిధ్యం

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 6: జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ బాలికల జట్టుకు జగిత్యాలకు చెందిన క్రీడాకారిణి కారుణ్య ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు జగిత్యాల బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బేణుగోపాల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కారుణ్యను పలువురు అభినందించారు.